




# ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్పార్క్ ఎడిషన్ EVENING 6 PM

సంపుటి (Volume): 1 ✦ సంచిక (Issue): 184 ✦ Published From: నంద్యాల (Nandyal) ✦ పేజీలు 3 ✦ https:www.prajarepublic.com ✦ వెల - 1/- | శనివారం 08 ఫిబ్రవరి 2025

RNI No: APTEL/2023/87888 Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


## ఢిల్లీ ఓటర్లకు సెల్యూట్.. అభివృద్ధి మా గ్యారంటీ: ప్రధాని మోదీ

దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా ఘన విజయం సాధించింది. దీనిపై ప్రధాని మోదీ స్పందించారు.



**దిల్లీ, ఫిబ్రవరి 8, (రిపబ్లిక్ న్యూస్):** 27 ఏళ్లపాటు కాంగ్రెస్, ఆన్‌ఆద్మీపార్టీ పాలన చూసిన ఢిల్లీ ఓటర్లు ఈసారి భాజపాకు అవకాశం ఇచ్చారు. కమలం పార్టీకి భారీ విజయాన్ని కట్టబెట్టారు. అందుకుగానూ ప్రధాని మోదీ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఢిల్లీ ఓటర్లకు సెల్యూట్ అంటూ ఎక్స్ వేదికగా సంతోషం వ్యక్తంచేశారు. భాజపాకు చరిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టిన సోదరసోదరీమణులకు అభినందనలు తెలియజేశారు. ఇక అభివృద్ధి తమ గ్యారంటీ అన్నారు.

## మోదీపై విశ్వాసం మరోసారి రుజువైంది: పవన్ కల్యాణ్

దిల్లీ అసెంబ్లీ ఎన్నికలతో ప్రధాని మోదీపై విశ్వాసం మరోసారి రుజువైందని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.

**అమరావతి, ఫిబ్రవరి 8, (రిపబ్లిక్ న్యూస్):** దిల్లీ అసెంబ్లీ ఎన్నికలతో ప్రధాని మోదీ పై విశ్వాసం మరోసారి రుజువైందని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఢిల్లీ ఎన్నికల్లో భాజపా విజయం సాధించడంపై ఆయన స్పందించారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా నిలిచేలా మోదీ పాలన సాగిస్తున్నారని కితాబిచ్చారు. మోదీ నిర్దేశించిన లక్ష్యం అందుకోవడంలో దిల్లీ పాత్ర అత్యంత కీలకమని చెప్పారు. డబుల్ ఇంజిన్ సర్కార్ ద్వారా దేశ రాజధానిలో సమ్మిళిత అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. అమిత్ షా రాజకీయ అనుభవం, చాతుర్యం సత్ఫలితాలనిచ్చాయని తెలిపారు.



## దిల్లీ పీఠం భాజపాదే..
## ప్రముఖుల గెలుపోటములు

దిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో భాజపా ఘన విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో పలువురు ఆప్ పెద్దలకు షాక్ తగిలింది.

**దిల్లీ, ఫిబ్రవరి 8, (రిపబ్లిక్ న్యూస్):** ఎగ్జిట్ పోల్స్ అంచనాలను నిజం చేస్తూ అసెంబ్లీ ఎన్నికల్లో ఢిల్లీ ఓటర్లు భాజపాకు పట్టం కట్టారు. ఘన విజయాన్ని అందించారు. కమలదళం హెూరులో.. గత మూడు పర్యాయాలు (2013లో హంగ్ ఏర్పడగా కాంగ్రెస్ మద్దతుతో ఆప్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది) అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ కొట్టుకుపోయింది. శనివారం వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో భాజపా మ్యాజిక్ ఫిగర్ (36)ను దాటి 43 స్థానాల్లో విజయం సాధించింది.



మరో 5 చోట్ల ఆధిక్యంలో కొనసాగుతోంది. అంటే 48 స్థానాల్లో కమలం హవా కనబర్చింది. వరుసగా నాలుగోసారి అధికారంలోకి రావాలనుకున్న ఆమ్ ఆద్మీ పార్టీ ఆశలకు భాజపా గండికొట్టింది. అంతేకాదు.. ఆప్ అధినేత కేజీవాల్ సహా పలువురు పార్టీ పెద్దలకూ ఓటమి తప్పలేదు. నేటి ఫలితాల్లో ఆప్ 19 చోట్ల విజయం సాధించింది. మరో 3 చోట్ల ఆధిక్యంలో కొనసాగుతోంది. మొత్తంగా 22 స్థానాలకు పరిమితమైంది. ఇక, కాంగ్రెస్ ఈ ఎన్నికల్లోనూ ఏ మాత్రం ప్రభావం చూపించలేకపోయింది. కనీసం ఒక్క స్థానంలోనూ ఆధిక్యం సాధించలేకపోయింది.

### ప్రముఖుల ఫలితాలు ఎలా ఉన్నాయంటే..

- దిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ కేజీవాల్ న్యూదిల్లీ స్థానం నుంచి ఓటమి చవిచూశారు. భాజపా అభ్యర్థి పర్వేశ్ వర్మ చేతిలో 4,089 ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. ఇదే స్థానంలో పోటీ చేసిన మాజీ సీఎం షీలా దీక్షిత్ తనయుడు సందీప్ దీక్షిత్కు 4,568 ఓట్లు రావడం గమనార్హం.
- దిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి, ఆప్ సీనియర్ నేత మనీశ్ సిసోదియా జంగురాలో విజయం దక్కలేదు. తన సమీప భాజపా అభ్యర్థి తర్వీందర్ సింగ్ చేతిలో కేవలం 675 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు.
- దిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ.. కాల్కాజీ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. ఆది నుంచి వెనుకంజలో ఉన్న ఆమె చివరి రౌండ్లలో అనూహ్యంగా పుంజుకున్నారు. భాజపా అభ్యర్థి రమేశ్ బిధూరిపై 3,521 ఓట్ల తేడాతో గెలుపొందారు.
- ఆప్ సీనియర్ నేత సత్యేంద్ర జైన్ షాకూరి బస్తీలో ఓటమిపాలయ్యారు. ఇక్కడ భాజపా అభ్యర్థి కర్నాల్ సింగ్ 20,998 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు.

ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ గ్రేటర్ కైలాష్ స్థానంలో పరాజయం పాలయ్యారు. ఈ స్థానంలో

- భాజపా నాయకురాలు శిఖా రాయ్ 3,188 ఓట్ల తేడాతో నెగ్గారు.
- బిజ్వాసన్ నియోజకవర్గం నుంచి భాజపా నేత కైలాశ్ గెహ్లాత్ విజయం సాధించారు. తన సమీప ఆప్ అభ్యర్థి సురేందర్ భరద్వాజ్పై 9,833 ఓట్లతో గెలుపొందారు.
- భాజపా నేత అర్విందర్ సింగ్ లవ్లీ గాంధీ నగర్లో విజయం సాధించారు. ఆప్ అభ్యర్థిపై 12,748 ఓట్ల మెజార్టీతో నెగ్గారు.

## ఓడినా ప్రజల వెంటే ఉంటాం: కేజ్రీవాల్

ప్రజా సేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చారని.. ఎన్నికల్లో ఓడినా ప్రజల వెంటే ఉంటామని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు.

**దిల్లీ, ఫిబ్రవరి 8, (రిపబ్లిక్ న్యూస్):** ప్రజా సేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చామని.. ఎన్నికల్లో ఓడినా ప్రజల వెంటే ఉంటామని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీ ప్రజల తీర్పును శిరసావహిస్తామన్నారు. పదేళ్లలో దిల్లీ ప్రజల కోసం ఎంతో చేశామని చెప్పారు. విద్య, వైద్య మౌలిక సదుపాయాల కోసం ఎంతో కృషి చేసినట్లు వెల్లడించారు. నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిసామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను భాజపా అమలు చేయాలన్నారు. గెలిచిన భాజపా నేతలకు ఈ సందర్భంగా కేజ్రీవాల్ శుభాకాంక్షలు తెలిపారు.



ఎన్నికల్లో గట్టిగా పోరాడిన ఆప్ నేతలు, కార్యకర్తలకూ కేజ్రీవాల్ ధన్యవాదాలు తెలిపారు. తమ పార్టీ అధికారం కోసం రాజకీయాల్లోకి రాలేదని.. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో తాము ఆప్ను స్థాపించామని కేజ్రీవాల్ అన్నారు. నిరంతరం ప్రజల అభివృద్ధి, హక్కుల కోసం పోరాడామని వెల్లడించారు. తమ ప్రభుత్వం దిల్లీ ప్రజలకు ఉచిత విద్య, కరెంట్, వైద్యం, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించిందని.. మరే పార్టీ ఈ విధమైన సౌకర్యాలు అందించలేదని పేర్కొన్నారు. దిల్లీ సీఎం ఆతిశీ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి ఆప్‌కు ఎదురుదెబ్బ అని అన్నారు. తనపై నమ్మకంతో కాల్కాజీ ఓటర్లు తనను గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఇది సంబరాలు చేసుకునే సమయం కాదని.. భాజపా చేస్తున్న అక్రమాలకు, అవినీతికి వ్యతిరేకంగా తమ పార్టీ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని అన్నారు. ఆప్ నేతల పాలనా వైఫల్యాలు, కుంభకోణాల ఆరోపణలు, యమునా నది కాలుష్యం మొదలైన వాటి వల్ల అధికార ఆన్‌ఆద్మీ దిల్లీ ఎన్నికల్లో పరాజయం పాలయ్యింది. పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సహా పలువురు సీనియర్ నేతలు ఓటమిని ఎదుర్కొన్నారు. దాదాపు 27 ఏళ్ల తర్వాత భాజపా దేశ రాజధానితో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది.

### దిల్లీ ఎన్నికలు..
## మేధావి వర్గం ఓట్లు భాజపాకే: బండి సంజయ్

దిల్లీ ఎన్నికల ఫలితాల్లో భాజపా దూసుకెళ్తుండటంపై కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు.

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, (రిపబ్లిక్ న్యూస్):** దిల్లీ ఎన్నికల ఫలితాల్లో భాజపా దూసుకెళ్తుండటంపై కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు. ఢిల్లీ ప్రజలు చీపురుతో ఆమ్ ఆద్మీ పార్టీని ఊడ్చేశారన్నారు. "ప్రజాస్వామ్య బద్ధమైన పాలనను దిల్లీ ప్రజలు కోరుకున్నారు. అవినీతి, కుంభకోణాలు, జైలు పార్టీలు వద్దు అనుకున్నారు. ఢిల్లీలో కాషాయ జెండా ఎగురతుందని ముందు నుంచి ఊహించిందే. మేధావి వర్గం అంతా మా పార్టీకే ఓటు వేశారు. తెలంగాణలో కూడా అధికారంలోకి వస్తాం. రాష్ట్రంలో జరుగుతున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో భాజపా విజయం సాధిస్తుంది. రాష్ట్రంలోని



మేధావి, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు ఆలోచించి ఓటు వేయాలి. శాసనసభలో మీ సమస్యలపై ప్రశ్నించేది భాజపా ఒక్కటే" అని బండి సంజయ్ అన్నారు.

## కంగ్రాట్స్ రాహుల్..
## మరోసారి భాజపాను గెలిపించారు: కేటీఆర్ ఎద్దేవా

దిల్లీలో వెలువడుతున్న ఎన్నికల ఫలితాలపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు.




**హైదరాబాద్, ఫిబ్రవరి 8, (రిపబ్లిక్ న్యూస్):** ఢిల్లీలో వెలువడుతున్న ఎన్నికల ఫలితాల పై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. కాంగ్రెస్ పై వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కంగ్రాట్స్ రాహుల్గాంధీ అంటూ ఎద్దేవా చేశారు. రాహుల్ మరోసారి భాజపాను గెలిపించారని పేర్కొన్నారు. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ ఇప్పటి వరకు ఖాతా తెరవలేదు. ఇక్కడ భాజపా 43 స్థానాల్లో ఆధిక్యంలో దూసుకెళ్తుండగా.. ఆమ్ ఆద్మీ పార్టీ 27 స్థానాల్లో ముందంజలో ఉంది.

## మోదీపై నమ్మకంతోనే దిల్లీలో భాజపా గెలుపు :చంద్రబాబు

ప్రధానమంత్రి నరేంద్రమోదీపై ఉన్న నమ్మకంతోనే దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా ఘన విజయం సాధించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

**అమరావతి, ఫిబ్రవరి 8, (రిపబ్లిక్ న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్రమోదీపై ఉన్న నమ్మకంతోనే దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా ఘన విజయం సాధించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దిల్లీ ఎన్నికల ఫలితాలపై ఉండవల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. దిల్లీ ప్రజలు సరైన సమయంలో సరైన పార్టీని ఎన్నుకున్నారన్నారు. "1991 తర్వాత దేశంలో ఆర్థిక సంస్కరణలు వచ్చాయి. ఆర్థిక సంస్కరణలను తెలుగుబిడ్డ పీవీ తీసుకువచ్చారు. 1995-2024 మధ్య మన తలసరి ఆదాయం 9 రెట్లు పెరిగింది. సంపద సృష్టిస్తేనే ఆదాయం పెరుగుతుంది.. మౌలిక వసతులు వస్తాయి.




తెలుగు రాష్ట్రాల్లో 3వేల డాలర్ల (సుమారు రూ.2.63 లక్షలు) తలసరి ఆదాయం ఉంది. బిహార్ లో తలసరి ఆదాయం ఇంకా 750 డాలర్లే (సుమారు రూ.65వేలు) ఉంది. టెక్నాలజీ సాయంతో మనం ముందుకెళ్లాం. మనకు ఐటీ, మౌలిక వసతులు గేమ్ఛేంజర్గా మారాయి. సరైన సమయంలో సరైన నాయకత్వం చాలా కీలకం. సుపరిపాలన ఇస్తే మంచి రాజకీయాలకు నాంది పలికినట్టే. చాలా రాష్ట్రాలను దాటుకుని గుజరాత్ తలసరి ఆదాయం పెరిగింది. స్థిరమైన పాలన, పాలసీలు, గ్రోత్ గుజరాత్ అభివృద్ధికి కారణం. కొందరు నాయకులు సంక్షేమ కార్యక్రమాల పేరుతో అవినీతి చేస్తున్నారు. కొందరు నేతల వల్ల రాజకీయాల్లో కాలుష్యం పెరుగుతోంది" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఏపీ, దిల్లీ ప్రజలు తప్పు తెలుసుకుని కష్టాల నుంచి బయటపడ్డారు. "ఆప్ పాలనలో దిల్లీలో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయింది. కొన్ని విధానాల వల్ల అత్యంత కాలుష్య నగరంగా దిల్లీ మారింది. ఒకప్పుడు పంజాబ్కు అన్ని రంగాల్లో మంచి పేరుండేది. ఇవాళ పంజాబ్ అంటే డ్రగ్స్ గుర్తుకు వస్తున్నాయి. వైకాపా పాలనలో ఏపీలో మద్యం మాఫియా తయారైంది. ఏపీ, దిల్లీలో అమలు చేసిన పాలసీలకు విజయం దక్కలేదు. ప్రజల ఆకాంక్షలను వారు పట్టించుకోలేదు. ఓటేసిన పాపానికి ప్రజల భవిష్యత్తును కాటేశారు. ప్రజల అవకాశాలను పూర్తిగా నాశనం చేశారు. సంపద సృష్టించలేని, ప్రభుత్వానికి ఆదాయం పెంచలేని నేతలు ఎందుకు? ప్రజల జీవన ప్రమాణాలు, తలసరి ఆదాయం పెరుగుతూ ఉండాలి. ఏపీ, దిల్లీ ప్రజలు తప్పు తెలుసుకుని కష్టాల నుంచి బయటపడ్డారు. తెచ్చిన పాలసీలు ప్రజలపై ఎలాంటి ప్రభావం చూపించాయో నేతలు చర్చించాలి. పార్టీలు, నేతలు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. గుజరాత్లో సుస్థిర పాలనతో వృద్ధి 15 రెట్లు పెరిగింది. మంచి నాయకత్వంలో ముందుకెళ్తే 2047 నాటికి మన దేశమే నంబర్ వన్" అని చంద్రబాబు అన్నారు.

### నిన్న వరంగల్ డీటీసీ అరెస్టు..
## నేడు డీటీఓపై బదిలీ వేటు

వరంగల్ రవాణా శాఖ కార్యాలయ ప్రక్షాళనపై ప్రభుత్వం దృష్టి పెట్టింది.

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, (రిపబ్లిక్ న్యూస్):** వరంగల్ రవాణా శాఖ కార్యాలయ ప్రక్షాళనపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. నిన్న డీటీసీ శ్రీనివాస్ ఇళ్లల్లో ఏసీబీ దాడులు, అరెస్టు తర్వాత మరో అధికారిపై చర్యలు తీసుకుంది. తాజాగా వరంగల్ డీటీఓ లక్ష్మిపై బదిలీ వేటు వేసింది.

హైదరాబాద్లోని కమిషనర్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించింది. ఎంవీఐ శోభన్ బాబును వరంగల్ ఇంఛార్జ్ డీటీఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లా రవాణా శాఖ ఉప కమిషనర్ (డీటీసీ) పుప్పాల శ్రీనివాస్ ఇళ్లల్లో అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించి




ఆదాయానికి మించి ఆస్తులున్నాయని గుర్తించి అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

## హైకోర్టు ఆదేశాలు.. భీమిలి బీచ్‌లో ఆక్రమణలు, కట్టడాలపై జీవీఎంసీ సర్వే

సీఆర్ జడ్ నిబంధనలకు విరుద్ధంగా భీమిలి బీచ్ లో నిర్మాణాలు చేపట్టారని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది.

**విశాఖపట్నం, ఫిబ్రవరి 8, (రిపబ్లిక్ న్యూస్):** సీఆర్ జడ్ నిబంధనలకు విరుద్ధంగా భీమిలి బీచ్ లో నిర్మాణాలు చేపట్టారని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. హైకోర్టు ఆదేశాలతో భీమిలి బీచ్ లో జీవీఎంసీ అధికారులు శనివారం సర్వే చేపట్టారు. సీఆరీడ్, ఆర్డీవో, పీసీబీ, మున్సిపల్ అధికారులు సర్వేలో పాల్గొన్నారు. విశాఖ జిల్లా భీమిలి తీర ప్రాంతంలో కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్జెడ్) పరిధి ఎంతో సర్వే చేయాలని, అక్రమ నిర్మాణాలుంటే కూల్చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారంపై వారంలో నివేదిక ఇవ్వాలని స్పష్టం చేసింది. విశాఖ జిల్లాలో సీఆర్జ్ పరిధిని తేల్చి, అందులో అక్రమ నిర్మాణాలను కూల్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు తీరుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక శాఖ అధికారులు మరొక శాఖపై బాధ్యతను నెట్టుకుంటూ అలసత్వం ప్రదర్శిస్తున్నారని, ఇకనైనా మేల్కొనాలని ఘాటుగా వ్యాఖ్యానించింది. సీఆర్ డ్ పరిధిని తేల్చడానికి ఇబ్బందేంటని సూటిగా ప్రశ్నించింది. ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్మెంట్ అథారిటీ (ఏపీసీజెడ్ఎంఏ), జీవీఎంసీ కమిషనర్, విశాఖ జిల్లా కలెక్టర్తో కమిటీని ఏర్పాటు చేసింది. నిబద్ధత గల అధికారుల బృందంతో సర్వే చేయించాలని కమిటీకి స్పష్టం చేసింది. ప్రస్తుతం సర్వేను భీమిలికి పరిమితం చేస్తున్నామని, తర్వాత భీమిలి నుంచి విశాఖలోని ఆర్కే బీచ్ వరకు సర్వే చేయిస్తామని తేల్చి చెప్పింది. నివేదిక ఇవ్వడంలో విఫలమైతే తదుపరి విచారణకు హాజరుకావాలని కమిటీ సభ్యులను ఆదేశించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. భీమిలి బీచ్ వద్ద సముద్రానికి అతి సమీపంలో సీఆర్జ్ నిబంధనలకు విరుద్ధంగా వైకాపా మాజీ నేత విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి కాంక్రీట్ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని జనసేన కార్పొరేటర్ పీఎల్వీఎన్ మూర్తి యాదవ్ గతంలో హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. భీమునిపట్నం (భీమిలి) సీఆర్ జడ్ జోన్ పరిధిలో శాశ్వత రెస్టోబార్ల ఏర్పాటుతో తాబేళ్ల ఉనికికి ప్రమాదం పొంచి ఉందంటూ గ్రామాభివృద్ధి



సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు మరో పిల్ వేశారు. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన హైకోర్టు.. సీఆర్జ్ పరిధి నిర్ణయించి, అక్రమ నిర్మాణాలు ఉంటే కూల్చివేయాలని ఆదేశించింది.


printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com



# రెండు దశాబ్దాలుగా అటకెక్కిన భూగర్భ డ్రైనేజీ నిర్మాణం

## నీటి మూటలుగా మారిన నేతల హామీలు

- ప్రభుత్వాలు మారినా ఫలితం శూన్యం
- మురికి కూపాలుగా శివారు కాలనీలు



- రూ.120 కోట్లతో 2004లో ప్రతిపాదనలు
- మురికి కూపంగా కేసీ కెనాల్
- బొంబాయి నుండి భూగర్భ శాఖ నిపుణులు
- ఆరు గ్రామ పంచాయతీలు విలీనం
- కేంద్ర ప్రభుత్వం సహకరిచాలి... మేయర్ బీ.వై.రామయ్య




**కర్నూలు బ్యూరో ఫిబ్రవరి 8, (రిపబ్లిక్ న్యూస్):** కర్నూలు నగరంలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం గత 23 ఏండ్లుగా నిర్మాణానికి నోచుకోకుండా అట కేక్కింది. గత రెండు దశాబ్దాలకు పైగా నగర ప్రజలు ఎదురు చూస్తున్నారు. నిధులు లేని కారణంగా నిర్మాణానికి నోచుకోవడం లేదు అని అధికారులు చెబుతున్నారు. కర్నూలు నగరం మున్సిపాలిటీ నుండి 1995 సంవత్సరంలో నగర పాలక సంస్థగా రూపాంతరం చెందింది. అప్పట్లో ఈ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపారు. ప్రతిపాదనలు బుట్ట దాఖలా అయ్యాయి తప్ప ఏ ముఖ్య మంత్రి కూడ నిధులు మంజూరు చేయలేదు అన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అప్పటి నుండి ఇప్పటి వరకు ఈ సమస్య పరిస్కారం కావడం లేదు. నగర పరిధిలో 385 చదరపు కిలోమీటర్ల మేర మురుగు కాలువలు ఉన్నాయి. చిన్న కాలువల కారణంగా మురుగు నీరంతా రోడ్డు పైకి వచ్చి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన నగర ప్రజల కల మాత్రం నెరవేరడం లేదు. ఎన్నికల సమయంలో నాయకులు వారి పబ్బం గడుపుకునేందుకు ఓట్ల కోసం మాత్రం కనిపించే నాయకుకులు గెలిచిన తరువాత సమస్యలు ఏ మాత్రం పట్టించు కున్న దాఖలాలు కనిపించక పోవడంతో శివారు కాలానీల ప్రజలు మురికి కూపంలో మగ్గిపోతున్నారు.

పి.నజీర్ అహమ్మద్ కర్నూలు బ్యూరో



ప్రభుత్వాలు మారుతున్న ఫలితం శూన్యం అని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. గతంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు మంత్రులుగా ఉన్నారు. ఇందులో ఎమ్మిగనూరు నుండి బీవీ మోహనరెడ్డి, నంద్యాల నుండి ఫరూక్ మునిసిపల్ శాఖ మంత్రులుగా పనిచేశారు. అప్పట్లో నేతలు ఇచ్చిన హామీలు నీటి మూటలు అయ్యాయన్న విమర్శలు ఉన్నాయి. పాత నగరంలో బ్రిటీష్ కాలం నాటి కాలువలు ఉన్న కారణంగా ఆ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బంది అంత ఇంత కాదు. ఇరుకు వీదుల్లో చిన్న కాలువలతో పడుతున్న ఇబ్బంది గురించి ఎన్ని సార్లు అధికారులకు, నాయకులకు వినతి చేసుకున్న పట్టించుకునే నాథుడే లేడు. గత 23 సంవత్సరాల నుండి ఎదురు చూపులే మిగియాలి. ప్రస్తుతం




నగర విస్తీర్ణం కూడా బాగా పెరిగింది. జనాభా కూడ పెరిగింది. ప్రస్తుతం నగర విస్తీర్ణం 116.75 చదరపు కిలో మీటర్లు గా ఉంది. గతంలో 3.42 లక్షల జనాభా ఉండేది. ప్రస్తుతం 6.50 లక్షలకు చేరుకుంది. పెరిగిన జనాభా కు అనుగుణంగా వార్డులు కూడా పెరిగాయి.

మురుగు కాలువలను మాత్రం అభివృద్ధి చేయ-ంలేక పోయారన్న విమర్శలు ఉన్నాయి. మున్సిపాలిటీ లో 1995లో మొదటి మేయర్ బంగి అనంతయ్య ఉన్నప్పుడు 33 వార్డులు ఉండేవి. ప్రస్తుతం బీ వై రామయ్య మేయర్ గా ఉన్నారు. నగరంలో 52 వార్డులు ఉన్నాయి. ఈ వార్డుల్లో కూడా ప్రజలు కాలువలు సరిగా లేక ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా శివారు కాలనీల మీద అధికారులు, పాలక వర్గం దృష్టి పెట్టి అభి వృద్ధి పనులు చేయాలనీ కోరుతున్నారు. 23 సంవత్సరాల క్రితం అంత టెక్నాలజీ లేదు. ప్రస్తుతం పూర్తి స్థాయిలో పెరిగింది. ఆధునిక మైన మీసినరి ఉంది. భూమి లోపల ఉన్న రాతిని ప్రమాదం లేకుండా ఎలాంటి పేలుడు లేకుండ ప్రజలు నష్ట పోకుండా తొలగించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

## రూ.120 కోట్లతో 2004 లో ప్రతిపాదనలు

మురుగు కాలువ వ్యవస్థ ను ఆధునీకరిచేందుకు నగరంలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని 2004 లో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపారు. ఇప్పటికే ముగ్గురు మేయర్ లు మారిపోయారు. నాలుగవ మేయర్‌గా బి వై రామయ్య ప్రస్తుతం ఉన్నారు. ఐతే ఏ ఒక్కరి వల్ల సమస్య పరిస్కారం కాలేదు. జిల్లా కు చెందిన ఎమ్మెల్యే లు గతం లో మంత్రులుగా ఉన్నారు. వీరు కూడా ఈ విషయం గురించి అంతగా పట్టించు కోలేదన్న విమర్శలు ఉన్నాయి. 20 ఏండ్ల క్రితం ఈ నిర్మాణానికి 120 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. అప్పట్లో ఆ నిధులు కూడా తీసుకు రాలేక పోయారు అన్న విమర్శలు ఉన్నాయి. కాగా ప్రస్తుతం దాదాపు 1000 కోట్లు ఖర్చు పెడితే తప్ప ఈ నిర్మాణం పూర్తి కాదని నిపుణులు చెబుతున్నారు.

## మురికి కూపంగా కేసీ కెనాల్



నగరంలో మురుగు నీరు మల్లించేందుకు ఎక్కడ అవకాశం లేక పోవడంతో కేసీ కెనాల్ లోకి వెళుతున్నాయి. దీంతో కర్నూలు కడప కాలువ మురికి కుపంగా మారిపోయింది. అంతే కాకుండ నగరంలోని మురుగు నీరంతా హంద్రీ, తుంగ భద్ర నది లో కలుస్తున్నాయి. పుష్కరాల సమయం లోకూడా భక్తులకు ఈ మురుగు కలిసిన నీటి లోనే పవిత్ర స్నానం చెయ్యాలిసిన గతి పడుతుంది. నగర ప్రజల తాగునీ రు అందించేందుకు నగర పాలక సంస్థ అధికారులు కేసీ కెనాల్ నీటినే తాగు మునిసిపల్ అధికారులు తప్పని సరి పరిస్థితుల్లో వినియోగిస్తున్నారు. తుంగ భద్ర నది నీటిని కూడా వినియోగిస్తున్నారు. ఈ మురుగు నీరు ప్రధానంగా నగరంలోని సుద్ద వాగు నుండి బయటకు వస్తుంది. దీంతో ఆ చుట్టు పక్కల కొన్ని కాలనీలకు ఇబ్బంది కరంగా మారింది. ఈ వాగు లోని మురుగు నీరు లక్ష్మి నగర్, ఆరోరానగర్, బి క్యాంపు కాలనీలతో పాటు శివారు కాలనీల ప్రజలకు ఇబ్బంది కరంగా మారింది.

## బొంబాయి నుండి భూగర్భ శాఖ నిపుణులు

కర్నూలు నగరంలో భూగర్భ డ్రైనేజి నిర్మాణానికి వీలు అవుతుందా లేదా అని పరిశీలించేందుకు బొంబాయి నుండి నిపుణులు అప్పట్లో వచ్చి పరిశీలన చేశారు. భూమిలోపల రాయి ఎక్కువ ఉందని ఈ రాతి కతువలు తొలగించాలి అంటే నిధులు ఎక్కువ అవసరం అవుతాయిని చెప్పారు. దీంతో పనులు చేసేందుకు కాంట్రాటర్లు ముందుకు రాలేదు. ఏ ప్రభుత్యం అధికారం లోకి వచ్చిన ఈ విషయం గురించి పట్టించు కోలేదు.

## ఆరు గ్రామ పంచాయతీలు విలీనం

నగర పరిధి విస్తరించేందుకు మునగాలపాడు, లక్ష్మీ పురం, మామిడాలపాడు, స్టాంటాన్ పురం, పెద్దపాడు, బస్తిపాడు గ్రామ పంచాయతీలను నగర పాలక సంస్థలో విలీనం చేశారు. పరిస్థితి ఈ పంచాయతీల్లో మరింత దారుణంగా మారింది. అభివృద్ధి నామమాత్రం ఉందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామలను విలేనం చేశారు తప్ప కొత్త మురుగు కాలువల నిర్మానాలు జేరగడం లేదు అని ప్రజలు అంటున్నారు. ఈ గ్రామాలను అభివృద్ధి చేయాలనీ కోరుతున్నారు. కేంద్రం నుండి నిధులు తెప్పించెందుకు కర్నూలు ఎంపి నాగరాజు సహకరిచాలి అని పార్ల మెంట్ సమావేశాల సమయం లో ఈ విషయం లేవనేత్తి నిధులు మంజూరు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

## కేంద్ర ప్రభుత్యం సహకరిచాలి... మేయర్ బి.వై.రామయ్య



మేయర్ బీ.వై.రామయ్య

భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి నిధులు ఎక్కువ అవసరం అవుతాయి. ఇందుకు ఒక రాష్ట్ర ప్రభుత్యం వల్ల సాధ్యం కాదు. కేంద్ర ప్రభుత్యం సహరిస్తే ఫలితం ఉంటుంది. భూమిలో రాతి పొరలు ఎక్కువగా ఉన్నాయి. ఇందుకు నిధులు ఎక్కువ అవసరం అవుతాయి. 2005 - 2006 లో అప్పటి కర్నూలు మేయర్ రఘురామి రెడ్డి అప్పటి కేంద్ర పట్టణాభి వృద్ధి శాఖ మంత్రి జయలపాల్ రెడ్డి కి ప్రతిపాదనలు పెట్టారు. కర్నూలు లో ఈ నిర్మాణం వీలు పడదు. భూమి లో నాప రాయి ఎక్కువ ఉన్న కారణం వల్ల అది తొలగించాలి అంటే ఇబ్బంది ఉంటుందని ఇందుకు ఎమ్మిగనూరుకు నియోజక వర్గానికి భూగర్భ డ్రైనేజి నిర్మాణం చేపట్టెందుకు అనుమతి ఇచ్చారు. ఇప్పుడు డ్రైనేజి కంటే ముఖ్యం తాగునీరు కర్నూలు నగరానికి తాగు నీటి సమస్య ఎక్కువ ఉంది ఈ సమస్య పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.









## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1834: మొట్టమొదట రసాయనిక మూలకాలతో ఆవర్తన పట్టికను ఆవిష్కరించిన రసాయన శాస్త్రవేత్త మెండలీఫ్ జననం (మ.1907). (చిత్రంలో)
- 1880: రంగస్థల నటుడు బళ్ళారి రాఘవ జననం (మ.1946).
- 1897: పూర్వ భారత రాష్ట్రపతి డా.జాకీర్ హుస్సేన్ జననం (మ.1969).
- 1931: అమెరికాకు చెందిన నటుడు జేమ్స్ డీన్ జననం (మ.1955).
- 1941: భారతీయ గజల్ గాయకుడు జగ్జీత్ సింగ్ జననం (మ.2011).
- 1963: భారతీయ క్రికెట్ మాజీ కేప్టన్ ముహమ్మద్ అజహరుద్దీన్ జననం.
- 1971: నిజాము సంస్థానంలో భారత ప్రభుత్వ ప్రతినిధిగా పనిచేసిన కె. ఎం. మున్షీ మరణం (జ.1887).


మెండలీఫ్


బళ్ళారి రాఘవ


డా.జాకీర్ హుస్సేన్


జేమ్స్ డీన్


జగ్జీత్ సింగ్


ముహమ్మద్ అజహరుద్దీన్


కె.ఎం.మున్షీ

రిపబ్లిక్ స్పోర్ట్స్

# తుది జట్టులో పంత్ కష్టమేనా?
# కొత్త లెఫ్ట్హ్యాండర్ దొరికినట్లేనా?

టెస్టుల్లో అదరగొట్టే రిషబ్ పంత్ పరిమిత ఓవర్ల క్రికెట్లో మాత్రం కాస్త తడబాటుకు గురవుతున్నాడు. దీంతో వికెట్ కీపర్ కమ్ బ్యాటర్గా కేఎల్ రాహుల్ వైపే మేనేజ్మెంట్ మొగ్గు చూపిస్తోంది.



ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత్ వన్డే సిరీస్ ను ఆడుతోంది. ఇంగ్లండ్ తో మూడు వన్డేల సిరీస్లో భాగంగా ఆదివారం రెండో మ్యాచ్ జరగనుంది. తొలి వన్డేలో వికెట్ కీపర్గా కేఎల్ రాహుల్కు మేనేజ్మెంట్ తీసుకుంది. రిషబ్ పంత్ను బెంచ్కి పరిమితం చేసింది. కేఎల్ను కాదని అక్షర్ పటేలు బ్యాటింగ్ ఆర్డర్లో ముందుకు పంపించింది. అతడు హాఫ్ సెంచరీ సాధించి ఆకట్టుకున్నాడు. కుడి-ఎడమ కాంబినేషన్ కోసమే ఇలా చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఇంగ్లండ్తో మిగతా వన్డేల్లోనూ.. అలాగే ఛాంపియన్స్ ట్రోఫీలో కూడా పంత్కు తుది జట్టులో అవకాశాలు రావడం కష్టమేనని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. అయితే, మిడిలార్డర్లో పంత్ ఉంటే ప్రత్యర్థులు కాస్త భయపడతారని.. జట్టును గెలిపించే ఇన్నింగ్స్ ఆడటం అతడి ప్రత్యేకతంటూ మరికొందరు కొనియాడారు. ఈక్రమంలో భారత మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత సంజయ్ మంజ్రేకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "నేను ఇంగ్లండ్తో తొలి వన్డే మ్యాచ్కు ముందు.. రిషబ్పంత్ను చాంపియన్స్ ట్రోఫీని దృష్టిలో ఉంచుకొని ప్రయత్నించాలని సూచించా. టాప్ -7 బ్యాటర్లలో తప్పకుండా ఎడమచేతివాటం ప్లేయర్లు ఉండాలి. ఇప్పుడు తొలి వన్డే తర్వాత అక్షర్ పటేల్ మంచి ఆప్షన్గా అనిపిస్తోంది. టెస్టుల్లోనూ అతడూ అద్భుతమైన ఆటతీరు ప్రదర్శించాడు. వన్డేల్లోనూ స్పిన్నర్లపై ఎదురుదాడి చేస్తున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో స్పిన్ ప్రభావం చాలా ఎక్కువగా ఉండనుంది. మిడిలార్డర్లో అక్షర్ పటేల్ సరిపోతాడు. దీంతో బౌలింగ్ ఆప్షన్ కూడా ఉంటుంది. కేఎల్ రాహుల్ ఇటీవల మంచి ఫామ్లో ఉన్నాడు. ఇప్పుడు ఇంగ్లండ్తో తొలి వన్డేలో తక్కువ స్కోరుకే వెనుదిరిగినంత మాత్రాన కంగారు అవసరం లేదు. ఐసీసీ టోర్నీలోనూ ప్రధాన వికెట్ కీపర్గా కేఎల్కే అవకాశం రావచ్చు. రిషభ్ పంత్కు ఛాన్సు తక్కువే" అని మంజ్రేకర్ వెల్లడించాడు.

# జోష్ పెంచిన ఆర్సి 16 టీమ్.. అప్డేట్ పంచుకున్న సినిమాటోగ్రాఫర్!

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న చిత్రం 'ఆర్సీ 16' (వర్కింగ్ టైటిల్) ఈ మూవీ సినిమాటోగ్రాఫర్ ఆసక్తికర అప్డేట్ ఇచ్చారు.



రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. 'ఆర్సీ 16'గా ఇది ప్రచారంలో ఉంది. ఇటీవల దీని రెగ్యులర్ షూట్ మొదలైంది. అయితే ఈ సినిమా స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్లో రానున్నట్లు చాలా రోజుల నుంచి వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమాకు వర్క్ చేస్తోన్న సినిమాటోగ్రాఫర్ రత్నవేలు పెట్టిన పోస్ట్ అందరిలోను ఆసక్తిని పెంచుతోంది. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉండే రత్నవేలు తాజాగా 'ఆర్సీ 16' షూటింగ్ అప్డేట్ను పంచుకున్నారు. శరవేగంగా ఈ చిత్రం షూటింగ్ జరుగుతున్నట్లు తెలుపుతూ ఓ ఫొటో షేర్ చేశారు. అయితే, ఆ పోస్టుకు ఆయన పెట్టిన క్యాప్షన్స్ ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. "నైట్ షూట్, ఫ్లడ్ లైట్స్, క్రికెట్ పవర్, డిఫరెంట్ యాంగిల్స్" అని కాప్షన్ పెట్టారు. క్రికెట్ స్టేడియంలో ఉండే లైట్ల ఫొటోను పంచుకున్నారు. కాగా, ప్రస్తుతం ఈ పోస్టు వైరల్ అవుతోంది. గతంలోనూ ఈ సినిమా గురించి రత్నవేలు ఓ పోస్ట్ పెట్టి అందరిలోను ఆసక్తి కలిగించారు. ఇందులోని ఓ సీక్వెన్స్ కోసం నెగెటివ్ రీల్ వినియోగించనున్నట్లు తెలిపారు. సహజత్వం కోసం అలా చేయనున్నట్టు పేర్కొన్నారు. 'దేవర' సినిమాకీ కొంతమేర ఆ ప్రయత్నం చేశానని చెప్పారు. "పూర్తిసా-ధ్యిలో నెగెటివ్ రీల్ తో షూటింగ్ చేయడం తేలికైన విషయం కాదు. డిజిటల్ కెమెరాలతో షూటింగ్ చేస్తుంటే.. నటులు ఎన్ని టేక్స్ తీసుకున్నా సమస్య ఉండదు. అదే నెగెటివ్ ఉండే కెమెరాలతో చేయడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం" అని పేర్కొన్నారు. బుచ్చిబాబు ఈ సినిమా కోసం దాదాపు రెండేళ్ల నుంచి వర్క్ చేస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే కథతో ఈ సినిమా సిద్ధం కానున్నట్లు తెలుస్తోంది. ఇందులో రామ్చరణ్ పాత్ర పవర్ఫుల్ ఉండనుంది. జాన్వీకపూర్ కథానాయిక. కన్నడ నటుడు శివ రాజ్కుమార్, జగపతిబాబు ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్నారు. రెహమాన్ స్వరాలు అందించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు కలిసి నిర్మిస్తున్నాయి. ఈ చిత్రానికి 'పెద్ది' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. ఈ చిత్రానికి సంబంధించి ఇప్పటికే మ్యూజిక్ వర్క్స్ మొదలయ్యాయని.. రెండు పాటలు కూడా పూర్తి చేశానని ఇటీవల రెహమాన్ తెలియజేశారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

# పక్కనోడిని తొక్కేయడానికి నెగెటివ్ పీఆర్ లూ చేస్తారు : నాగచైతన్య

చిత్ర పరిశ్రమలో పీఆర్ యాక్టివిటీని ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు నటుడు నాగచైతన్య. ఇప్పుడున్న రోజుల్లో తమ సినిమాని ప్రమోట్ చేసుకోవడానికి ప్రతిఒక్కరూ పీఆర్ లను నియమించుకుంటున్నారని అన్నారు.



చిత్ర పరిశ్రమలో పీఆర్ యాక్టివిటీని ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు నటుడు నాగచైతన్ ఇప్పుడున్న రోజుల్లో తమ సినిమాని ప్రమోట్ చేసుకోవడానికి ప్రతిఒక్కరూ పీఆర్ ను నియమించుకుంటున్నారని అన్నారు. సోషల్మీడియా వేదికగా మనం చేసే ప్రమోషన్స్ వల్లనే సినిమా ఆడియన్స్కి వెళ్తుందని తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. "పీఆర్ గేమ్లోకి నేను చాలా ఆలస్యంగా వచ్చాను. సోషల్మీడియా కూడా అరుదుగా వాడుతుంటా. సినిమా కోసం వర్క్ చేశామా.. ఇంటికి వెళ్లామా.. మన జీవితం మనం చూసుకున్నామా అన్నట్లు ఉంటా. అంతేకానీ నాకు ఈ రాజకీయాలు తెలియవు. నువ్వు ఉన్న రంగంలో రాణించడం కోసం కొన్ని పనులు చేయాల్సి ఉంటుంది. అప్పుడు తప్పదు. గత రెండేళ్లలో పీఆర్ అనేది ఎక్కువైంది. ప్రతినెలా స-ుమారు రూ.మూడు లక్షలు ఖర్చు పెట్టకపోతే నువ్వు సరైన దారిలో ఉన్నట్లు కాదు. ఏదైనా సినిమా రిలీజ్ అవుతుందంటే తప్పకుండా పీఆర్ కోసం ఖర్చు పెట్టాలి. సినిమా గురించి ప్రేక్షకులు మాట్లాడుకునేలా చేయాలి. అందులో తప్పు లేదు. కానీ కొంతమంది కావాలని అనవసర ప్రచారాలు చేస్తారు. పక్కనోడిని తొక్కేయడానికి చూ-స్తారు. అది నాకు ఏమాత్రం అర్థం కాదు. అలా చేయడం కూడా తప్పు. పక్కనోళ్లను ఇబ్బందిపెట్టే బదులు.. ఆ సమయాన్ని మన ఎదుగుదల కోసం ఉపయోగించుకోవడం.. ఆ డబ్బుతో ప్రశాంతంగా ఇష్టమైన విహారయాత్రలకు వెళ్లడం చేయొచ్చు కదా" అని నాగచైతన్య చెప్పారు. ఇదే ఇంటర్వ్యూలో ఆయన తన మాజీ స-తీమణి సమంతతో విడిపోవడం గురించి కూడా మాట్లాడారు. "విడాకులు అనేది రాత్రికి రాత్రి తీసుకున్న నిర్ణయం కాదు. ఎన్నో రోజులు చర్చించుకున్న తర్వాతే మేమిద్దరం విడిపోవాలనుకున్నాం. మా విడాకులు ఇతరులకు వినోదంలా అయిపోయింది. ఎన్నో గాసిప్స్ వార్తలు వచ్చాయి. నా మీద నెగెటివ్ కామెంట్లు చేసేవారు ఇకనైనా ఆపేయండి.. మీ భవిష్యత్ గురించి మంచిగా ఆలోచించండి" అని అన్నారు. నాగచైతన్య నటించిన చిత్రం 'తండేల్. చందూ మొండేటి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సాయిపల్లవి కథానాయికగా నటించారు. శుక్రవారం ఇది ప్రేక్షకుల ముందుకువచ్చి మంచి విజయాన్ని అందుకుంది.

## అందం

# జుట్టుకి సంబంధించిన అన్నీ సమస్యల్ని దూరం చేసే వేపనూనె, ఇంట్లోనే తయారు చేయండమెలా

వేపతో ఎన్నో లాభాలున్నాయి. దీనిని రాస్తే చాలా సమస్యలు దూరమవుతాయి. అందులో ఒకటి జుట్టు రాలడం కూడా తగ్గడం. దీనికోసం వేప నూనెని ఎలా తయారు చేయాలి, ఎలా వాడాలి, ఇదెలా పనిచేస్తుందో తెలుసుకోండి.



వేపలో ఎన్నో అద్భుత గుణాలు ఉన్నాయి. ఇది చర్మ, జుట్టు సమస్యల్ని దూరం చేస్తుంది. వేపలో యాంటీ సెప్టిక్, యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉన్నాయి. దీనిని బ్యూటీ రొటీన్లో చేర్చడం వల్ల అందానికి సంబంధించిన చాలా సమస్యలు దూరవ-ువుతాయి. దీనిని జుట్టు, చర్మ సమస్యల్ని దూరం చేసేందుకు వాడుకోవచ్చు. దీనిలోని అద్భుత గుణాలు జుట్టు, చర్మానికి మేలు చేస్తాయి.





### ఎలా తయారు చేయాలి



- వేప నూనెని కూడా ఇంట్లోనే తయారు చేయొచ్చు. దీనికోసం
- తాజా వేపాకుల్ని తీసుకోవాలి.
- వీటన్నింటిని శుభ్రంగా క్లీన్ చేయాలి. తర్వాతి వీటన్నింటిని గ్రైండ్ చేసి పేస్టులా చేయాలి.
- ఇప్పుడు ఈ పేస్టుని కొబ్బరి లేదా ఆలివ్ ఆయిల్లో కలపండి.
- ఇప్పుడు కలిపిన మిశ్రమాన్ని డబుల్ బాయిల్ మెథడ్లో వేడి చేయండి.
- వేడి చేసిన నూనె రంగు మారుతుంది. అప్పుడు మంటని తగ్గించండి.
- ఇప్పుడు తయారైన నూనెని పల్చని గుడ్డ లేదా ఫిల్టర్లో వేసి ఫిల్టర్ చేయండి.
- అందులోనుంచి వచ్చిన నూనెని గాజు సీసాలో స్టోర్ చేయండి.

### ఎలా వాడాలి



ఇలా తయారైన వేపనూనెని వారానికి రెండు సార్లు మీ స్కాల్ప్, హెయిర్కి మసాజ్ చేయండి. దీంతో జుట్టు సమస్యలు ఏవైనా కూడా దూరమై జుట్టు చక్కగా పెరుగుతుంది. జుట్టుకి నూనెని రాసి మెల్లిగా మసాజ్ చేయాలి. దీంతో స్కాల్ప్పై రక్త ప్రసరణ కూడా పెరుగుతుంది.

### ఎప్పుడు క్లీన్ చేయాలి



తలకి ఈ నూనె రాసిన తర్వాత గంటసేపు అలానే ఉంచాలి. లేదంటే, ఇబ్బంది లేదనుకుంటే రాత్రంతా కూడా ఉంచొచ్చు. కానీ, కొద్దిగా చేదుగా వాసన వస్తుంది. కాబట్టి, గంటసేపు అలానే ఉంచి ఆ తర్వాత మైల్డ్ షాంపూతో షాంపూ చేసుకోవాలి.

### ఇంకెన్ని విధాలుగా వాడొచ్చు



ఇప్పుడు ఈ నూనెని హెయిర్ కేర్ రొటీన్లో రకరకాలుగా వాడొచ్చు. దీనికోసం ఆయిల్ని తీసుకుని మీ షాంపూలో కూడా కలిపి షాంపూ చేయచ్చు. దీంతో కుదుళ్ళ, జుట్టుకి బాగా రాయండి.

**కండీషనింగ్**

ఈ నీమ్ ఆయిల్ని కండీషనర్లో కలిపి జుట్టుకి అప్లై చేసి కాసేపు ఉంచి ఆ తర్వాత షాంపూ చేయొచ్చు. దీంతో తలలో ఇరిటేషన్ తగ్గుతుంది. స్కాల్ప్ కూడా హెల్దీగా ఉంటుంది.

### లాభాలు



ఈ నూనెని హెయిర్కేర్ రొటీన్లో యాడ్ చేసి మసాజ్ చేయడం వల్ల హెల్దీ సెల్స్ పెరుగుతాయి. బ్లడ్ సర్క్యులేషన్ పెరుగుతుంది. దీంతో హెయిర్ఫోలికల్స్ బలంగా మారి జుట్టు పొడుగ్గా పెరుగుతుంది. దీంతో జుట్టు పల్చబడదు. ఊడిపోదు, పొల్యూషన్, స్ట్రెస్, మెడికేషన్ వల్ల జుట్టు రాలే సమస్యలుంటే అవి కూడా తగ్గిపోతాయి. ఈ నూనెలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ బయాటిక్, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు బట్టతలని తగ్గిస్తాయి. దీంతో పాటు సోరియాసిస్ని దూరం చేస్తాయి. జుట్టు రాలడాన్ని తగ్గించి జుట్టు బలంగా, ఒత్తుగా పెరిగేలా చేస్తాయి.

**చుండ్రు**

చుండ్రుతో బాధపడేవారికి ఈ నూనె వరమని చెప్పొచ్చు. దీనిని రాయడం వల్ల జుట్టు డ్రైగా మారదు. ఇందులోని యాంటీ ఫంగల్ గుణాలు డాండ్రఫ్ని తగ్గిస్తుంది.

**పేలు**

వేప నూనె రాయడం వల్ల పేల సమస్య తగ్గుతుంది. దీంతోపాటు జుట్టు బ్రేకేజ్ అవ్వడం వంటి సమస్యల్ని తగ్గించి జుట్టు బలంగా మారేలా చేస్తుంది. ఇందులోని అద్భుత గుణాలు జుట్టుని మాయిశ్చరైజ్ అయ్యేలా చేస్తాయి. దీంతో జుట్టు ఆరోగ్యంగా, ఒత్తుగా పెరిగేలా చేస్తాయి.

**తెల్ల వెంట్రుకలు**

ఈ నూనె రాయడం వల్ల జుట్టు తెల్లబడకుండా ఉంటుంది. రెగ్యులర్గా రాస్తే కచ్చితంగా జుట్టు తెల్లబడడం కాస్తా కంట్రోల్ అవుతుంది.

### సైడ్ ఎఫెక్ట్స్

ఇన్ని లాభాలున్న వేప నూనె జుట్టుపై కొన్నిసార్లు సైడ్ ఎఫెక్ట్స్ని కూడా చూపిస్తుంది. మరీ సున్నితంగా ఉండే తలపై ఈ వేపనూనె రాస్తే మంట, చికాకు వంటి సమస్యలొస్తాయి. కాబట్టి, ఈ నూనెని రాసే ముందు ప్యాచ్ టెస్ట్ చేయడం మంచిది.

**గమనిక:** నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.